క్లుప్తంగా

ఆలయ వార్షికోత్సవం



పూల వస్త్రాలంకరణలో సరస్వతి దేవి

సంగారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని సరస్వతి నగర్‌లో గల శ్రీ విద్యా సరస్వతి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి కుంబాభిషేకం, ప్రత్యేక పుష్ప అలంకరణ, వస్త్ర అలంకరణ చేసిన అమ్మ వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు శేషాచారి, మీనానాథ్ శర్మ అర్చక బృందం ఆధ్వర్యంలో గణపతి పూజ హోమం, మహా హారతి నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కమిటీ సభ్యులు లింగమ్మ, శ్రీధర్, మహేంద్ర, రాజు, వినయ్, విఠల్, శ్రీశైలం, కుమార్, రవి, సందీప్, మహేశ్ పాల్గొన్నారు.

బీరప్ప స్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రత్నాపూర్‌లో ఈనెల 8న జరిగే బీరప్ప స్వామి జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే హరీశ్‌రావు శుక్రవారం ఆవిష్కరించారు. మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన గొల్ల, కుర్మలతో పాటు గ్రామ పెద్దలు శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని హరీశ్‌రావు నివాసానికి వెళ్లారు. అక్కడ జాతర పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతరకు రావాలని గ్రామస్తులు కోరారు.

విగ్రహాల ఊరేగింపు



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండల కేంద్రంలో రేణుక ఎల్లమ్మ మందిరంలో విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో విగ్రహాలను ఊరేగించారు. మహిళలు బోనాలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. యువకులు నృత్యాలు చేసి అలరించారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం బాధ్యులు నారాగౌడ్, రఘులుగౌడ్, రమేశ్‌గౌడ్, నర్సింహగౌడ్, రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎంఆర్‌ఎఫ్ ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న కేపీఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్

సదాశివపేట(సంగారెడ్డి): ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ కార్మిక యూనియన్ ఎన్నికలకు కార్మికులు సిద్ధం కావాలని కార్మిక పోరాట సమితి అధ్యక్షుడు కొత్తగొల్ల చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో ఓ ఫంక్షన్ హాలులో మేడే సందర్భంగా కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌ఎఫ్ మెదక్ ప్లాంట్‌లో త్వరలో జరుగనున్న ఎన్నికలకు కార్మికులు సిద్ధంగా ఉండాలన్నారు. యజమాన్యం కార్మికులపై కక్షసాధింపు చర్యలను కేపీఎస్ సహించబోదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాయిలు, ప్రసాద్, కేపీఎస్ నాయకులు మల్లేశం, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా భావన రుషి జయంతి



రుద్రాభిషేకం నిర్వహిస్తున్న పండితులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని భక్త మార్కండేశ్వర ఆలయంలో శుక్రవారం భావన రుషి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వేణుభట్ పండితులు రుద్రాభిషేకం, యజ్ఞం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భావన రుషి గొప్పతనం గురించి పండితులు వివరించారు. అలాగే భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. పద్మశాలి సంఘం అధ్యక్షుడు జనార్దన్, నాయకులు విఠల్, వెంకటేశం, నాగరాజు, గోపాల్, ప్రభు, రాజేశ్ పాల్గొన్నారు.

వైభవంగా బోరంచ నల్లపోచమ్మ జాతర

- ఏడువారాల ఉత్సవాలకు ఆలయం ముస్తాబు
- దర్శనానికి తరలిరానున్న భక్తులు

నారాయణఖేడ్: జిల్లాలోనే సుప్రసిద్ధ బోరంచ నల్లపోచమ్మ ఆలయ ఏడువారాల జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని ముస్తాబు చేశారు. మొక్కులు తీర్చుకునేందుకు వేలాదిగా భక్తులు రానున్నారు. రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి సైతం భక్తులు వస్తారు. ప్రతీ ఏటా అక్షయ తృతీయ తర్వాత వచ్చే మొదటి గురువారం నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడు వారాల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. జాతర ప్రారంభం సందర్భంగా నల్లపోచమ్మ అమ్మవారికి పంచామృతం అభిషేకం, కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయం ఆవరణలో పందిళ్లు, విద్యుద్దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో తాగునీటి ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో శివరుద్రప్ప తెలిపారు. కాగా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ప్రతీ గురువారం, ఆదివారం భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. జూన్ 12వ తేదీవరకు ఏడు వారాల పాటు జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతాయి. ఉత్సవాలకు సామాన్య భక్తులతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు తరలిరానున్నారు.



కొలువైన అమ్మవారు



ఉత్సవాలకు ముస్తాబైన బోరంచ నల్లపోచమ్మ ఆలయం



సామాజిక సమరసత రథయాత్రను స్వాగతిస్తూ ర్యాలీ

హైందవం ద్వారా సమాజం అభివృద్ధి

జహీరాబాద్: హిందూ సమాజంలోని అన్ని కులాలు, వర్గాలు, జాతులను కలుపుకొనిపోవడమే హైందవ గొప్పతనం అని విశ్వ హిందూ పరిషత్ అఖిల భారత సహ కార్యదర్శి దేవ్‌జీ రావత్ అన్నారు. హైందవ చైతన్యం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సమరసత రథయాత్ర జహీరాబాద్ చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని దత్తగిరి కాలనీలో గల పంచముఖ హనుమాన్ మందిరం నుంచి మార్కండేశ్వర ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎల్లారెడ్డి, ఆయా ప్రాంతాల పీఠాధిపతులు సంగ్రాం మహరాజ్, సిద్దేశ్వర మహరాజ్, శంకరస్వామి, రాచయ్య స్వామి, శివయోగి హాజరయ్యారు.

కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన శాంతినగర్, శ్రీ నగర్ జంట కాలనీల యజమానుల సంక్షేమ సంఘం కార్యాలయ నూతన భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలనీల సంక్షేమ సంఘాలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, అఫ్జల్, భిక్షపతి, కాలనీ అధ్యక్షుడు అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ కుమార్

మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్ /పటాన్ చెరు టౌన్: డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ సుమాన్ కుమార్ వివరాల ప్రకారం... గురువారం అర్ధరాత్రి సంగారెడ్డి పాత బస్టాండ్ వద్ద, అలాగే జాతీయ రహదారి, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో తనిఖీల్లో ఏడుమందిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం జిల్లా కోర్టులో హాజరుపరచగా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ నలుగురికి రూ.2వేలు, మిగతా ఇద్దరికి రూ.1500, ఒకరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. అలాగే పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపారు. వీరిని కోర్టులో హాజరు పర్చగా ఏడుగురికి రూ.వెయ్యి జరిమానా, ఇద్దరికి రూ.2 వేలు, మరో వ్యక్తికి రూ.1500 జరిమానా విధించింది.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న తట్టునారాయణ

జహీరాబాద్ టౌన్: మండలంలోని మల్‌చెల్మ గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు కృషి వల్ల ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్డుకు రూ. 5 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే అదేశాల మేరకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నసీర్, మాజీ ఎంపీటీసీలు ఇస్మాయిల్, మోహిన్, రాములు,ప్రేమ్ సింగ్, బీసీ సెల్ అధ్యక్షుడు అమిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులపై దాడి హేయం

ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా

సంగారెడ్డి : ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్, శానిటేషన్‌లో పనిచేస్తున్న మహిళ, వికలాంగ కార్మికుడిపై దురుసుగా ప్రవర్తించి దాడి చేయడం దారుణమన్నారు. దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శోభా,రమాదేవి,శారద రమేష్, శ్రీనివాస్, మల్లమ్మ యాదగిరి,రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

రోగులకు మెరుగైన వైద్య సేవలు

మునిపల్లి(అందోల్): పీహెచ్‌సీ ద్వారా ఆయా గ్రామాల రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగారం గొల్ల అంజయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కంకోల్ చౌరస్తాలో రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీహెచ్‌సీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి దామోదర రాజనర్సింహ సహకారంతో కంకోల్‌లో పీహెచ్‌సీని సుమారు 2.40 కోట్లతో నూతన భవనం నిర్మాణం అవుతుందన్నారు. త్వరలోనే నూతన భవనం పనులు పూర్తి కాగానే మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ గాయత్రి, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, ఎంపీడీఓ హరినందన్‌రావు, డాక్టర్ సంధ్యారాణి, రవి, సంగమేశ్వర్, రమేశ్‌యాదవ్‌తో పాటు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న గ్రంథాలయ చైర్మన్ ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది

రేణుక మాత ప్రతిష్ఠ మహోత్సవాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని పెద్దాపూర్‌లో రేణుక మాత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అమ్మవారికి నిత్యార్చన, గంగపూజ, అర్చన, అభిషేకం నిర్వహించి, గంగాజలం తీసుకొచ్చారు. భక్తులు ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



గంగాజలాన్ని తీసుకురావడానికి వెళ్తున్న భక్తులు

కులగణనకు ఆదర్శం తెలంగాణ

జహీరాబాద్ టౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి కులగణన చేయించి దేశంలో ఆదర్శంగా నిలిచిందని యూత్ కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగిరెడ్డి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు సీఎం కులగణన చేయించారని, కేంద్రం రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, నరేష్, బబ్లు, కిరణ్‌గౌడ్, రాఘవేందర్, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న డబుల్ బెడ్ రూం లబ్ధిదారులు

సంగారెడ్డి జోన్: రామచంద్రాపురం పరిధిలోని కేసీఆర్ నగర్ కాలనీలోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో సరైన మౌలిక వసతులు కల్పిస్తే నివాసం ఉంటామని లబ్ధిదారులు పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి వినతి పత్రం అందించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 నెలల క్రితం పట్టాలు అందించగా, 7 నెలల క్రితం ఇళ్లు కేటాయించారని చెప్పారు. అక్కడ తాగునీరు, విద్యుత్, రోడ్లు, వైద్యం తదితర వసతులు లేకపోవడంతో కొంత మంది అక్కడ నివాసం ఉండటం లేదన్నారు. సౌకర్యాలు లేకపోయినా కొంతమంది ఉంటున్నారని పేర్కొన్నారు. కేటాయించిన ఇళ్లు ఎందుకు రద్దు చేయకూడదో ఒక వారంలో వివరణ ఇవ్వాలని అని మెసేజ్‌లు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పార్కుల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌లో పార్కుల అభివృద్ధికి వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప తెలిపారు. శుక్రవారం రామచంద్రాపురం శ్రీనివాస్‌నగర్ కాలనీలోని బాల విహార్ పార్కును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కు ప్రహరీ నిర్మాణంలో సమస్యలు రావడంతో అధికారులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మాకమిటీ డైరెక్టర్ నగేష్, నాయకులు మల్లేష్, నవీన్, రమేష్, నరసింహ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

కార్మికులకు సన్మానం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలోని పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను కమిషనర్ మధుసూదన్ రెడ్డి మేడేను పురస్కరించుకొని ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక అర్బన్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఆయా విభాగాల్లో పని చేస్తున్న కార్మికుల సేవలను ఆయన కొనియాడారు. వారి సేవలకు సముచిత స్థానం కల్పించి గౌరవించాలన్నారు. అనంతరం వారికి సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్వో నర్సింలు, మేనేజర్ మల్లికార్జునస్వామి, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికులతో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఆర్వో నర్సిహులు

సంక్షిప్త వార్తలు

◆ హుండీ లెక్కింపు



నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని సాయిబాబా కాలనీలో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. తొమ్మిది నెలలకు సంబంధించి భక్తులు హుండీలో వేసిన డబ్బులు, కానుకలను ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యుల పర్యవేక్షణలో భక్తులు లెక్కింపు చేపట్టారు. మొత్తం హుండీ ఆదాయం రూ.85,550 సమకూరిందని నిర్వాహకులు తెలిపారు.

◆ పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జిన్నారం (పటాన్‌చెరు): అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. మండలంలో కురిసిన వర్షాలకు రైతులకు తీవ్రంగా పంట నష్టం జరిగిందన్నారు. చేతికి రావాల్సిన పంట నేలపాలు కావడంతో రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వరి, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. నష్టం జరిగిన ప్రాంతాల్లో ప్రభుత్వం సర్వే చేయించి తగువిధంగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, నాయకులు సత్యనారాయణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

◆ రాజీవ్ యువ వికాసంపై సమావేశం

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్‌లో రాజీవ్ యువ వికాసం పథకంపై శుక్రవాసం సమావేశం నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల కింద వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులు పరిశీలించారు. అనంతరం బ్యాంకర్లతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు రమేష్‌బాబు, మల్సూర్‌నాయక్ పాల్గొన్నారు.

◆ బాధితకుటుంబాలకు పరామర్శ

జిన్నారం (పటాన్‌చెరు): ఇటీవల విగ్రహ ధ్వంసం కేసుల నేపథ్యంలో బాధిత కుటుంబాలను ఎమ్మెల్సీ అంజిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. శుక్రవారం జిన్నారం మండల కేంద్రంలోని ఆయా కుటుంబాలను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. అన్ని విధాల అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఐలేష్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, బాధితకుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

◆ బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన సుమారు 50 బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. అక్కడ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌తో పాటు నాయకులు ప్రవీణ్‌కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

◆ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



నారాయణఖేడ్: ఉద్యోగులు అంకితభావంతో చేసిన సేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని ఖేడ్ న్యాయమూర్తి శ్రీధర్ మంథాని అన్నారు. కోర్టు సూపరింటెండెంట్ మోతీరాం పదవీ విరమణ పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మోతీరాంను శాలువా, పూలమాలతో సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భోజిరెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి నర్సింహారావు, న్యాయవాదులు సుధాకర్, మొహిద్‌పటేల్, భువనేశ్వరి తదితరులు మోతతీరాం చేసిన సేవలను కొనియాడారు.

◆ మహిళల రక్షణకు ప్రభుత్వం పెద్దపీట

చేర్యాల(సిద్దిపేట): మహిళల రక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ షీ టీం సభ్యులు సూచించారు. పట్టణ కేంద్రంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లకు చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తుల మాటలు నమ్మొద్దన్నారు. రాత్రి సమయాల్లో ఇంటికి తాళంవేసి ఆరుబైట నిద్రించేవారు, వ్యవసాయ పనుల కోసం ఒంటరిగా వెళ్లే మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా మహిళలను వేధించినా, అవహేళనగా మాట్లాడినా వెంటనే 100 లేదా షీటీం నంబరు 87126 67434కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు సదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

◆ శాంతిని నెలకొల్పండి

సిద్దిపేటకమాన్: శాంతి చర్చలకు ప్రతిపాదించిన మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతికి చొరవ చూపాలని మంజీరా రచయితల సంఘం ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్, బస్తర్, తెలంగాణలోని దండకారణ్య ప్రాంతాల్లో కొనసాగుతున్న మిలిటరీ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలన్నారు. ఆదివాసులు జీవించే హక్కును కాలరాయడమే అవుతుందని, కాల్పుల విరమణ పాటించి మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరారు. కార్యక్రమంలో మంజీర రచయితల సంఘం అధ్యక్షుడు, జిల్లా వర్కింగ్ జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు రంగాచారి, ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రతినిధులు భగవాన్‌రెడ్డి, అశోక్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ బడుల్లోనే ఉత్తమ బోధన

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని నాగపురిలో శుక్రవారం ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారన్నారు. అలాగే విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఐలయ్య, మాజీ వైస్‌ఎంపీపీ కె.రాములు, ఉపాధ్యాయులు ఎస్.కృష్ణమూర్తి, టి.మనోజ్‌కుమార్, ప్రకాశ్‌రెడ్డి, స్వర్ణకుమార్, కనకలింగం, స్వామి తదితరులు పాల్గొన్నారు.